క్లుప్తంగా

సీతారామ కాలువ పరిశీలన



నకిరిపేట వద్ద సీతారామ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు: మండల పరిధిలోని నకిరిపేట వద్ద జరుగుతున్న సీతారామ కాలువ పనులను బుధవారం పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. కాలువ పనుల తీరును స్థానిక రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. కాలువ పనులను తొందరగా పూర్తిచేసి సాగునీరు అందించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామంలో 'నిక్షయ్ షివిర్'

మణుగూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో చేపడుతున్న నిక్షయ్ షివిర్ కార్యక్రమాన్ని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామం బుగ్గలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్ రావు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. అనుమానితులను గుర్తించి నమూనాలను సేకరించారు. అనంతరం మొబైల్ వాహనంలోని డిజిటల్ ఎక్స్ రే ద్వారా పలువురు అనుమానితులకు ఎక్స్‌రే, కళ్లె పరీక్షలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో రేడియో గ్రాఫర్ లహరి, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, రవి, ప్రేమ్, సుజాత, కౌసల్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్ల అందజేత



సోలార్ లైట్లను అందుకున్న వలస ఆదివాసీలతో దాతలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోగల రేగడ గ్రామంలో నివాసం ఉంటున్న వలస ఆదివాసీ కుటుంబాలకు బుధవారం ఉచితం సోలార్ లైట్లను అందించారు. ఏపీలోని ఏలూరు జిల్లా కొయ్యలగూడేనికి చెందిన లివింగ్ శాక్రిఫిస్ మినిస్ట్రిస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ దేవా సహాయం తనయుడు థామస్ ఆధ్వర్యంలో కుటుంబానికి ఒక కిట్టు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ..అటవీ ప్రాంతంలో ఉన్న వలస ఆదివాసీలను అంధకారం నుంచి దూరం చేసేందుకు వీటిని అందించామని, పంపిణీ చేసిన సోలార్ లైట్ల విలువ రూ.లక్షా 75వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జక్కుల రాంబాబు, క్రిష్, సామ్యేల్, విస్లీ, రవి, ఎంఎస్ రాజు, రాజేష్ పాల్గొన్నారు.

సాయి మందిర వార్షికోత్సవం

బూర్గంపాడు: సారపాకలోని పుష్కర ద్వారక సాయిబాబా మందిర అష్టమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా పలు రకాల హోమాలు, పూజాకార్యక్రమాలు చేపట్టారు. అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మేళతాళాలు, కోలాటాలతో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మండడి హనుమంతరావు, సింగమనేని విజయభాస్కర్, ఇండ్ల శ్రీనివాసరావు, అక్కర భాస్కరాచారి, సత్యనారాయణ, జీవన్ రెడ్డి,రాంబాబు, రామకృష్ణ, రామారావు, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, గిరి పాల్గొన్నారు.

పోరాటాలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కెచ్చెల కల్పన

అశ్వారావుపేటరూరల్: మహిళలపై జరిగే దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కెచ్చెల కల్పన అన్నారు. బుధవారం అశ్వారావుపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించాలని, పరువు హత్యలను అరికట్టాలని కోరారు. ప్రజాపంథా పాల్వంచ డివిజనల్ నాయకులు గోగినపల్లి ప్రభాకర్, కొమరం చిన్న లక్ష్మి, పూసం శారద, కంగాల సైదమ్మ, కుంజా లక్ష్మి, భూదేవి, సింగమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- విద్యార్థులకు ఎమ్మెల్యే కెరీర్ గైడెన్స్
- పీహెచ్‌సీలో తనిఖీ
- మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



పట్వారిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: విద్యార్థులు కష్టంతో కాకుండా నేర్చుకోవాలనే పట్టుదల, లక్ష్యాలతో ఇష్టపూర్వకంగా చదివి, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. బుధవారం మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలోని ఏకలవ్య పాఠశాల, పార్కలగండి ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే జారే.. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. వార్షిక పరీక్షలు రాయనున్న ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. పట్వారిగూడెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రి అంతా కలియ తిరిగి, ఫార్మసీ గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదినారాయణ భూమిపూజ చేసి.. శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిర్మాణదశలో ఉన్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, దారం గోవిందరెడ్డి, ఫజల్‌బక్ష్ కిరణ్‌రెడ్డి, సంకా శంకర్, ఎండి.అన్వర్, పుల్లయ్య, ఎండి.ఇమ్రాన్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిని బాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బందితోపాటు గ్రామస్తులతో ఆలయంలో బుధవారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటారని వారికి ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ పాలకమండలి నియామకంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. తొలుత ఎమ్మెల్యే స్వామివారి సన్నిధిలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ పీవీ రమణ, వనమా గాంధీ, పర్సా వెంకట్, వేములు రమణ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బూర్గంపాడు: కేజీబీవీలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



భద్రాచలంఅర్బన్: విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

బూర్గంపాడు: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డిలు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బూర్గంపాడులోని కస్తూర్బా గాంధీ పాఠశాలను బుధవారం వారు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యమైన సరుకులతో తాజా కూరగాయలతో విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి యదుసింహ రాజు, కేజీబీవీ ఇన్‌చార్జ్ సుశీల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న గురుకుల ఆశ్రమ పాఠశాల, కళాశాలను బుధవారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి సందర్శించారు. పాఠశాల ఆవరణలోని వంటశాలను పరిశీలించి, స్టోర్ రూంలో ఉన్న వస్తువులను నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

వాహన ధ్రువపత్రాలు ఉండాలి



వాహన తనిఖీలు చేపడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజ్ కుమార్

పినపాక: ప్రతీ వాహనదారుడు తమ వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ సమీపంలో ఎస్సై రాజ్ కుమార్‌తో కలిసి ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు పరిమితి మించి లోడు వేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతు కూలీలను అధిక సంఖ్యలో ఎక్కించుకొని ప్రయాణాలు చేస్తే వాహనాలను జప్తు చేస్తామన్నారు. నూతన నిబంధనల ప్రకారం వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేసినా.. త్రిబుల్ రైడింగ్ వంటివి చేపట్టినా భారీ ఫైన్ విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న మహిళలు

మణుగూరురూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ఆధ్వర్యంలో బుధవారం పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో సింగరేణియుల మహిళలకు, యువతులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా సేవ అధ్యక్షురాలు దుర్గం సుమితి రామచందర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మహిళలు, యువతులు ఉత్సాహంగా క్రీడలు ఆడారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ ఎస్ శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, ఇల్లెందు లేడీస్ క్లబ్ సభ్యులు, సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేయండి

మణుగూరురూరల్: అక్రమంగా తీసుకొచ్చి నిల్వ చేస్తున్న ఇసుకను అధికారులు వెంటనే సీజ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. మణుగూరు మండలంలో కొంతమంది అధికారుల అండదండలతో పట్టపగలే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. పేదోడు ఇసుక కావాలంటే సవాలక్ష నిబంధనలు చెప్పే అధికారులు.. మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

క్వింటా మిర్చికి రూ.30 వేలు ఇవ్వాలి



చర్ల: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం: నష్టాల ఊబిలో కూరుకుపోతున్న మిర్చి రైతులకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.30 వేలు ప్రకటించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానీ పాషాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సొసైటీ డైరెక్టర్స్ బొల్లి వెంకటరావు, కాలవ పూర్ణయ్య, పార్టీ నాయకులు అపకా వీర్రాజు, తునికి కామేశ్వరరావు, వాగే వెంకటేశ్వరరావు, రావులపల్లి పృథ్వి, భూక్యా చందు, మడకం భూపతి, తంతరపల్లి వెంకటేశ్వరరావు, కుమ్మరికుంట సూర్య, జంగిటి రాము, ఉమ్మినేని నాగరాజు, సోమినేని వెంకన్న పాల్గొన్నారు.

చర్ల: మిర్చి ధర తగ్గిపోవడంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టాల పాలవుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి క్వింటాకు రూ.30 వేలు చెల్లించి ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుదవారం చర్లలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కోకన్వీనర్ బనపోల్ పవన్‌కుమార్ మాజీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు, ఎస్‌డి.అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, కృష్ణార్జునరావు, రాము, నాగేశ్వరావు, మేడ సురేష్ పాల్గొన్నారు.

ఇసుక కూపన్లు జారీ

దుమ్ముగూడెం: మండలంలోని ప్రభుత్వ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఇసుక రవాణాకు కూపన్లు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ అశోక్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ పథకం కింద పనులు సీసీ రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణం, కిచెన్‌షెడ్‌ల నిర్మాణం నిమిత్తం అవసరమైన ఇసుక కావాల్సిన వారికి కూపన్లు జారీ చేస్తామన్నారు. ఇసుక కోసం సంబంధిత ట్రాక్టర్ నంబర్, ఎన్ఆర్‌జీఎస్ వర్క్ ఐడీ, ఇసుక ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తోలుతున్నది అనే వివరాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పరిశీలించి తహసీల్దార్ సంతకంతో ఇసుక కూపన్ జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని భూపతిరావు కాలనీలో బుధవారం జరిగిన డివిజన్ ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర కమిటీ అనుబంధ అసోసియేషన్ బుధవారం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. భద్రాచలం ఫ్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిరణ్, కార్యదర్శిగా స్వామితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఫ్లెక్స్ ధరలు స్వల్పంగా పెంచేందుకు ఈ నెల 8, 9 తేదీల్లో భద్రాద్రిలో ఫ్లెక్స్ షాపుల బంద్‌కు పిలుపునిచ్చినట్లు అధ్యక్ష, కార్యదర్శులు ప్రకటించారు.సమావేశంలో సభ్యులు రాధకృష్ణ, సతీష్, నజీర్, విజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి చాపలు పంపిణీ

పినపాక: తోగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు పడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని టీం సంబవా ఫౌండేషన్ సభ్యులు చాపలు పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం ఫౌండేషన్ తరఫున రూప్ల నాయక్ వాటిని పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లల తల్లితండ్రులు వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ టీచర్ అనంతలక్ష్మి, గ్రామస్తులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పొదెం వీరయ్యకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

దుమ్ముగూడెం: రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ పార్టీని కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ.. 35 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న పొదెంకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ కనుబుద్ది దేవా, మండల ఉపాధ్యక్షుడు, తెల్లం హరికృష్ణ, మోటుపల్లి నటరాజ స్వామి, నాయకులు శ్రీధర్ గడ్డ వెంకటేశ్వరావు, సిరపు అప్పల రెడ్డి, గడ్డం బాలాజీ, డింగి సందీప్ రెడ్డి, పాయం తిరుపతిరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

11న రవన్న వర్ధంతి సభ

గుండాల: దివంగత న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)9వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు ముక్తి సత్యం, కోరం సీతారాములు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం వర్ధంతి సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన ఖమ్మం పట్టణంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈసం కృష్ణ, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, అశోక్, మంగయ్య, బానోత్ లాలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

అశ్వాపురం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో స్థానికులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ రవీందర్ రెడ్డి, సైబర్ క్రైమ్ జిల్లా ఇన్స్‌పెక్టర్ జితేందర్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అజ్ఞానం వల్ల కాకుండా అవగాహన లోపం వల్లే ప్రజలు సైబర్ నేరాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఇతరులను చైతన్యం చేయాలని సూచించారు. సీఐ అశోక్‌రెడ్డి, భారజల కర్మాగారం డీజీఎం శ్రీనివాసరావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోండి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కొలతలు వేస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకోవాలని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ కోరారు. బుధవారం మండల పరిధిలోని కొండరెడ్ల గ్రామమైన పాత రెడ్డిగూడెంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామానికి 53 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒకొక్క ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం దశల వారిగా రూ.5లక్షల రూపాయాలు చెల్లిస్తుందని అన్నారు. పునాది స్థాయిలో రూ.లక్ష, లెంటల్ లెవల్‌కు రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తి చేసి ఆపై రంగులు వేసి, మరుగుదొడ్డి నిర్మిస్తే మరో రూ.లక్ష ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సోయం ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాము, కార్యదర్శి సబిత పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శ్రీను



చర్ల: చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇర్పా శ్రీను నియమితులయ్యారు. ఈయనతో పాటు 15 మందిని మార్కెట్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా పూనెం రాంబాబు, మెంబర్లుగా కారం కన్నయ్య, శ్యామల సీత, ఉయికా వెంకటేశ్వరావు, కారం జోగారావు, బోదెబోయిన చంద్రయ్య, ఆలెం సత్యనారాయణ, పోశెట్టి గౌరయ్య, పాయం వెంకటరమణయ్య, పొడియం సింగయ్య, యాలం సాయిలు నియమితులయ్యారు. వీరితో పాటు చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, భద్రాచలం వ్యవసాయశాఖ ఏడీఏ, చర్ల గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి కూడా మార్కెట్ కమిటీ మెంబర్లుగా ఉంటారని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలలో పేర్కొంది. త్వరలోనే మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్, కమిటీ మెంబర్లు పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి తుమ్మలతో కాంగ్రెస్ నాయకులు

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి నివాసంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు గోదావరి జలాలను, సీతారామ ప్రాజెక్టు ద్వారా తీసుకురావడానికి కృషి చేసిన మంత్రి తుమ్మలకు, ఆ మండలాలకు చెందిన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వేంసూరు మండలంలోని కల్లూరుగూడెంలో నిర్మించ తలపెట్టిన పామాయిల్ ఫ్యాక్టరీకి అనుసంధానంగా రహదారి నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ విషయంలో రైతులు సహకరించాలని, నాయకులకు మంత్రి సూచించారు. మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, ఎల్లిన రాఘవరావు, కాసాని నాగప్రసాద్, ఎల్లిన మురళి, వేల్ది జగన్మోహనరావు, గొర్ల సంజీవ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో ఎంట్రీ రిజిస్టర్లు చోరీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని నాలుగు లాడ్జీల్లో ఎంట్రీ రిజిస్టర్‌లను గుర్తు తెలియని దుండగులు మాయం చేశారు. గత ఏడాది డిసెంబర్ 25న కూడా ఇటువంటి సంఘటనే చోటు చేసుకోగా.. సదరు లాడ్జీల యజమానులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం బుధవారం తెల్లవారు జామున మరోసారి లాడ్జి రిసెప్షన్‌లో ఉండాల్సిన రిజిస్టర్లు చోరీకి గురయ్యాయి. కంగుతిన్న యజమానులు.. రిజిస్టర్లు ఎవరు దొంగతనం చేస్తున్నారో తెలియక తలపట్టుకుంటున్నారు. రిజిస్టర్లలో వచ్చిన కస్టమర్ లేదా భక్తుల ఆధార్ నంబర్‌తో సహా పూర్తి వివరాలు ఉంటాయి. ఈ విధంగా చోరీలకు పాల్పడుతున్న వారు సైబర్ కేటుగాళ్లా అనే అనుమానాలు స్థానికల్లో కలుగుతున్నాయి. అయితే సీసీ పుటేజీలతో భద్రాచలం సీఐ రమేష్‌ను లాడ్జి యజమానులు కలిసి ఫిర్యాదు చేశారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే నిజాలు వెలుగు చూసే అవకాశముంది.

వేతనాలు చెల్లించాలని వినతి

చర్ల: పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని కోరుతూ మిషన్ భగీరథ పథకం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. గడిచిన మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో పూట గడవడం కూడా కష్టంగా మారిందని, కాంట్రాక్టర్లకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్.. భగీరథ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సోడి పృథ్వీ, ఆర్.కిషోర్, బి.వినోద్ కుమార్, బి.రవివర్మ, ఎస్.సురేష్‌కుమార్, ఎస్.అరుణ్‌బాబు, ఎమ్.ప్రశాంత్, పి.నవీన్, జి.నాగమోహన్, కె.విష్ణు, ఎస్.లీలావాసు ఉన్నారు.

కరపత్రాల పంపిణీ

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ముద్రించిన కరపత్రాలను సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సారపాకలోని ఐటీసీ మెయిన్‌గేట్ వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలను రూ.26వేలకు పెంచాలని కోరారు. కనీస వేతన డిమాండ్‌పై మార్చి 1 నుంచి 7వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరి నాగేశ్వరరావు, ఎస్‌కె.పాషా, ఎం.వెంకటరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఈ విద్యా సంవత్సరపు ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం సుజావుగా ప్రారంభమైయ్యారు. తొలిరోజు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. ఆయా కేంద్రాల్లో ఉపాధ్యాయులు హాల్‌టికెట్లు పరిశీలించి లోపలికి పంపించారు. స్క్వాడ్‌లు పరీక్ష విధానాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రాన్ని పలువురు అధికారులు తనిఖీ చేశారు. ప్రశాతంగా పరీక్షలు జరిగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



దుమ్ముగూడెం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



మణుగూరుటౌన్: హాల్ టికెట్ నంబర్లు పరిశీలిస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు